
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

సంగారెడ్డి మెదక్ 5

సోమవారం 17 ఫిబ్రవరి 2025

జిల్లాల వార్తలు



గైర్హాజరైన వారికి రేపటి నుంచి ప్రాక్టికల్స్

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్‌కు గైర్హాజరైన జనరల్, ఒకేషనల్ విద్యార్థుల కోసం స్పెషల్ స్పెల్‌లో మరోసారి పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. రేపటి నుంచి 22 వరకు సంగారెడ్డి ప్రభుత్వ బాలుర జూనియర్ కాలేజీలో ప్రతీ రోజు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

నకిలీ డాక్టర్లు..

అనుమతి లేని వైద్యం

- విద్యార్హత ఒకటైతే.. ట్రీట్‌మెంట్ మరొకటి
- అర్హత లేకున్నా డాక్టర్లుగా చెలామణి
- నిబంధనలకు విరుద్ధంగా క్లినిక్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్లు
- ప్రజల ప్రాణాలతో చెలగాటం
- టీజీఎంసీ తనిఖీల్లో వెలుగులోకి
- అమలుకు నోచుకోని క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్



సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలో తనిఖీలు చేస్తున్న వైద్య మండలి అధికారులు (ఫైల్)

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): 'సంగారెడ్డి పాత బస్టాండ్ సమీపంలోని రెండు క్లినిక్‌లలోని ఆయుర్వేద వైద్యులు నిబంధనలకు విరుద్ధంగా రోగులకు అల్లోపతి వైద్యం చేయడం, యాంటి బయోటిక్స్, పెయిన్ కిల్లర్స్, స్టెరాయిడ్ ఇంజెక్షన్లు ఇస్తున్నారు.'

'సంగారెడ్డి పట్టణంలోని రాజంపేటలో ల్యాబ్ టెక్నీషియన్ వైద్య ఆరోగ్య శాఖ అనుమతి లేకుండా డయాగ్నోస్టిక్ సెంటర్ నెలకొల్పి రోగులకు పరీక్షలు చేస్తున్నారు.'

'సంగారెడ్డి మండలం ఫసల్‌వాది పరిధిలోని ఓ క్లినిక్‌లో డ్రగ్ కంట్రోల్ అథారిటీ అనుమతి లేకుండా పెద్ద మొత్తంలో అల్లోపతి మందులు నిల్వ ఉంచారు.'

పై విషయాలు ఈ నెల 8న సంగారెడ్డిలో వైద్య మండలి అధికారుల (టీజీఎంసీ- తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్) తనిఖీల్లో వెలుగు చూశాయి. ఈ వ్యవహారంలో అల్లోపతి వైద్యం చేస్తున్న ఇద్దరు నకిలీ డాక్టర్లు, అల్లోపతి మందులు రాస్తున్న మరో ఆయుర్వేదిక్ డాక్టర్, అనుమతి లేకుండా నడిపిస్తున్న ఓ డయాగ్నోస్టిక్ సెంటర్‌ను గుర్తించి ఆధారాలు సేకరించారు. ఎన్ఎంసీ చట్టం, టీఎస్ఎంపీఆర్, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టాలకు విరుద్ధంగా వీరిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ వైద్య మండలి అధికారులు పోలీసు కేసులు నమోదు చేశారు. చర్యలు తీసుకోవాలని సంబంధిత జిల్లా వైద్య ఆరోగ్య, డ్రగ్ కంట్రోల్, ఆయుష్ కౌన్సిల్‌కు సిఫారసు చేశారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోనే ఇలాంటే ఇక మారుమూల ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.


విద్యార్హత ఒకటి.. ట్రీట్‌మెంట్ మరోటి

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నుంచి అనుమతి తీసుకునేది ఒకటైతే.. కొందరు అనుమతి లేని వైద్యాన్ని కొన్నేళ్లుగా కొనసాగిస్తున్నారు. ప్రజల ప్రాణాలతో నిర్వాహకులు చెలగాటమాడుతున్నారనే ఆరోపణలున్నాయి. సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నుంచి 611 ఆస్పత్రులకు అనుమతి ఉన్నది. అందులో నర్సింగ్ హోమ్స్-హాస్పిటళ్లు 202, డెంటల్ హాస్పిటళ్లు 83, క్లినిక్స్-పాలీ క్లీనిక్‌లు 161, ఫిజియోథెరపి యూనిట్స్ 12, రిహాబిలిటేషన్ సెంటర్లు 2, డయాగ్నోస్టిక్-ల్యాబ్స్ 122, ఆయూష్ క్లినిక్‌లు 25, ఆయూష్ హాస్పిటళ్లు 4 ఉన్నాయని వైద్య ఆరోగ్యశాఖ అధికార వర్గాలు తెలిపాయి. అనుమతి కోసం మరో 50 వరకు దరఖాస్తు చేసుకున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. అనుమతి లేకుండా అనధికారికంగా కొనసాగుతున్నవి పదుల సంఖ్యలో ఉండవచ్చని తెలుస్తున్నది.

కమీషన్ల మత్తులో..

ప్రథమ చికిత్సలు మాత్రమే చేయాల్సి ఆర్ఎంపీ, పీఎంపీలు దవాఖానాల పేరిట బోర్డులు ఏర్పాటు చేసుకుని మరీ వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ప్రైవేటు ఆస్పత్రులతో కుమ్మక్కై కేసులను రెఫర్ చేస్తూ కమీషన్లు దండుకుంటున్నారు. జిల్లాలో ఎంత మంది ఆర్ఎంపీ, పీఎంపీలు ఉన్నారనే విషయం కూడా జిల్లా వైద్య శాఖ వద్ద లెక్కలు లేకపోవడం గమనార్హం. ప్రభుత్వం నుంచి ఎలాంటి గుర్తింపు లేకుండా అసోసియేషన్ ఏర్పాటు చేసుకొని జిల్లావ్యాప్తంగా

మిగతా 8వ పేజీలో..



హత్యలు.. హడల్

మాయమవుతున్న మానవత్వం

సంగారెడ్డి జిల్లాలో వరుస హత్యల కలకలం

కారణమేదైనా.. ప్రాణం తీయడమే!

క్షణికావేశంలో నిర్ణయాలు

నిండు జీవితాలు జైలుపాలు

అనాథలవుతున్న చిన్నారులు

రోడ్డున పడుతున్న కుటుంబాలు

ఆస్తి వివాదాలు, ప్రేమ వ్యవహారాలు, వివాహేతర సంబంధాలు ఏవైనా ప్రత్యర్థి ప్రాణం తీయడమే పరిష్కారం అనుకుంటున్నారు. మానవత్వమన్నదే లేనట్టు దారుణంగా తోటివారిని చంపుతున్నారు. మానవ సంబంధాలు మంట కలిసిపోతున్నాయి. మరోవైపు క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాలు తమతో పాటు తమవారికీ శాపంగా మారుతున్నాయి. ఇటు పెద్ద దిక్కును కోల్పోయి ఓ కుటుంబం.. అటు నేరానికి పాల్పడి కుటుంబ పెద్ద జైలుపాలు కావడంతో మరో కుటుంబం రోడ్డున పడుతున్నాయి.

7లో

తండ్రిని కొడుతుంటే అడ్డుకునేందుకు వెళ్లిన బాలిక మృతి

తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స

పరిస్థితి విషమించి మృత్యువాత

7

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

వేర్వేరు చోట్ల ఘటనలు..

పలువురికి గాయాలు

కొండపాకలో డీసీఎంను ఢీ కొట్టిన కారు

ఒకరు మృతి, నలుగురికి గాయాలు

గజ్వేల్‌లో రెండు కార్లు ఢీకొని ఒకరి దుర్మరణం

రామాయంపేటలో బైక్ ఢీకొని పాదచారి..

7

భవిష్యత్తు మనదే..


కార్యకర్తలతో మాజీ మంత్రి కేటీఆర్

6

హోరాహోరీ..

వట్‌పల్లి మండలం దేవునూర్, పాలడుగు శివారులోని హజ్రత్ బాబా భూదాన్ షావలి దర్గా ఉర్సు ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన కుస్తీ పోటీలు హోరాహోరీగా సాగాయి. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి మల్లయోధులు తలపడ్డ పోటీల్లో విజేతగా నిలిచిన శరత్ పవార్‌కు 6 తులాలు, రన్నరప్ రంజిత్ పవార్‌కు 5 తులాల వెండి కడియాలు అందజేశారు. యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వినయ్‌గౌడ్, మాజీ సర్పంచ్ విజయనర్సింహులు నాయకులు శేషారెడ్డి, పత్రి విఠల్, వెంకట్రావు, దిగంబర్‌రావు పాల్గొన్నారు.

వట్‌పల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి)



అమీన్‌పూర్

తహసీల్దార్ బదిలీ

తహసీల్దార్‌కు వ్యతిరేకంగా హైకోర్టులో ధిక్కరణ పిటిషన్లు

తక్షణం బదిలీ చేయాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ ఆదేశాలు

పటాన్‌చెరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : అమీన్‌పూర్ తహసీల్దార్ పి.రాధను బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. తహసీల్దార్ అమీన్‌పూర్ మండల పరిధిలోని పటేల్‌గూడలో ఇళ్ల కూల్చివేతలో కోర్టు ఆదేశాలను పరిగణలోకి తీసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరించారన్న ఆరోపణలతో బాధితులు కోర్టును ఆశ్రయించారు. ఇళ్లు కూల్చకుండా బాధితులు రిట్ పిటిషన్ నంబర్లు 27610, 27329,2734, 27899, 27923, 27963, 27978, 2781, 28009, 28050, 28077, 28088, 28089, 28090, 28092, 28093, 28117, 28119, 28406, 28292 కింద హైకోర్టులో కేసులు వేశారు. కోర్టు స్టేను పరిగణలోకి తీసుకోకుండా హైడ్రా సహకారంతో కూల్చివేతలకు పాల్పడ్డారని తహసీల్దార్‌పై ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో, తహసీల్దార్‌పై క్రమశిక్షణా చర్యల్లో భాగంగా తక్షణం బదిలీ చేయాలని సీసీఎల్ఏ నవీన్‌మిట్టల్.. సంగారెడ్డి కలెక్టర్‌ను ఆదేశించారు. ఈమేరకు కలెక్టర్ తహసీల్దార్‌ను బదిలీ చేస్తూ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. సీసీఎల్ఏ కమిషనర్ ఆదేశాల మేరకు జోగులాంబ గద్వాల్ జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. అమీన్‌పూర్ నుంచి బదిలీ అయిన తహసీల్దార్‌కు సరైన స్థానాన్ని కల్పించాలని ఆ కలెక్టర్‌కు సీసీఎల్ఏ కమిషనర్ నవీన్‌మిట్టల్ సూచించారు.

ఇరుకు గదులు.. అరకొర వసతులు

మెదక్ జిల్లాలో అంగన్‌వాడీలకు సొంత భవనాలు కరువు ● 1,076 అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలున్నవి 353 మాత్రమే!

- అద్దె భవనాల్లో 325 కేంద్రాలు
- పాఠశాలలు, దాతలు సమకూర్చిన భవనాల్లో 398 సెంటర్లు
- కొన్నిచోట్ల శిథిలావస్థలో తరగతి గదులు



కొల్చారం మండలం రాంపూర్‌లో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ కేంద్ర భవనం

నర్సాపూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల సంరక్షణతో పాటు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేశాయి. కానీ, సొంత భవనాలు లేక అరకొర సౌకర్యాలతో.. ఇరుకు గదుల్లో కేంద్రాలను నడపాల్సిన దుస్థితి నెలకొంది. మెదక్ జిల్లాలో చాలాచోట్ల సొంత భవనాలు లేక.. ఉన్నచోట శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా ఉన్న గదుల్లో కొనసాగుతున్నాయి. మెదక్ జిల్లా పరిధిలో మెదక్, నర్సాపూర్, రామాయంపేట, అల్లాదుర్గం ప్రాజెక్టుల పరిధిలో 1,076 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల్లో ఏడాది లోపు పిల్లలు 5,849 మంది, ఏడాది నుంచి మూడేళ్ల వయస్సున్నవారు 22,044 మంది, మూడు నుంచి ఆరేళ్ల వయస్సు పిల్లలు 19,626 మంది ఉన్నారు. జిల్లాలో గర్భిణులు 5,481 మంది, బాలింతలు 5,179 మంది, కిశోర బాలికలు 16,910 మంది ఉన్నారు. వీరందరికి ఆయా గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సేవలందుతున్నాయి. జిల్లాలో వేయికి పైగా అంగన్‌వాడీ కేంద్రాలుంటే కేవలం 353 కేంద్రాలకే సొంత భవనాలున్నాయి. 325 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మిగిలిన 398 కేంద్రాలు సమీప పాఠశాల్లో, దాతలు సమకూర్చిన భవనాల్లో సాగుతున్నాయి. అయితే, ప్రభుత్వం చెల్లించే అద్దె నామమాత్రంగా ఉండడంతో చాలా గ్రామాల్లో ఇరుకు గదులు, పెంకిటిళ్లు, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఇటీవల శివ్వంపేట మండలం లింగోజిగూడలో పాత పాఠశాల భవనంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం పైకప్పు పెచ్చులూడి పడ్డాయి. ఆ సమయంలో పిల్లలు లేకపోవడం ప్రమాదం తప్పింది. అనేకచోట్ల వర్షం వస్తే వర్షపు నీరు కారుతున్నది. జిల్లాలో కొన్నిచోట్ల సొంత భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరైన వాటిని అసంపూర్తిగానే వదిలేశారు. అంగన్‌వాడీ కేంద్రాలు అధ్వాన పరిస్థితుల్లో కొనసాగుతున్నా పట్టించుకునే నాథుడే లేడన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



శివ్వంపేట మండలం లింగోజిగూడలో పెచ్చులూడిన అంగన్‌వాడీ(ఫైల్)



చెట్టు కింద చదువుకుంటున్న అంగన్‌వాడీ చిన్నారులు(ఫైల్)



వెండి తొడుగులను అందజేస్తున్న భక్తులు

ఐదో వారం.. అశేష భక్తజనం

చేర్యాల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లన్న స్వామి బ్రహ్మోత్సవ జాతరలో భాగంగా ఐదో వారాన్ని పురస్కరించుకుని ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. తలనీలాలు సమర్పించి కోనేరులో పుణ్య స్నానమాచరించారు. భక్తిప్రపత్తులతో బోనం నివేదించి పట్నాలు రచించారు. స్వామివారిని దర్శించుకుని పట్టువస్త్రాలు, బండారి, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎల్లమ్మకు కల్లు, బెల్లంపానకం శాక పెట్టి బోనం నివేదించారు. గంగిరేగు చెట్టుకు ముడుపులు కట్టారు. స్వామివారి దర్శనానికి సుమారు 3 గంటలు సమయం పట్టింది. సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ మల్లన్నను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఎపిటోమ్ ప్రాజెక్ట్ మేనేజర్ కాంత జైపాల్ మల్లన్న ఆలయ గర్భాలయంలోని విఘ్నేశ్వర, మునీశ్వర, సంగమేశ్వర స్వామి విగ్రహాలకు 14 కిలోల వెండి తొడుగు, ఆభరణాలను మొక్కుబడిగా అందించారు.



మల్లన్న క్షేత్రంలో కిక్కిరిసిన గంగిరేగుచెట్టు ప్రాంగణం

అంతర్గత రహదారులు ఛిద్రం

మొరం, మట్టి వాహనాలతో గుంతలమయంగా మారిన రోడ్లు

రామచంద్రాపురం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం మండల పరిధిలోని తెల్లాపూర్ మున్సిపాలిటీలో ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేస్తున్న రోడ్లు అధిక లోడ్ లారీలు, ట్రక్కులు, టిప్పర్ల రాకపోకలతో ధ్వంసమవుతున్నాయి. అపార్ట్‌మెంట్ల నిర్మాణానికి తవ్వుతున్న సెల్లార్ల తవ్వకం నుంచి వస్తున్న మట్టిని తరలించే వాహనాలతో అంతర్గత రహదారులు దెబ్బతింటున్నాయి. నిబంధనల ప్రకారం మట్టి, మొరం తరలించే వాహనాలపై కవర్ కప్పి, ఎవరిపై పడకుండా తీసుకువెళ్లాలి. కానీ టిప్పర్ల డ్రైవర్లు ఇవేం పాటించకుండా రోజుకి 18 గంటల పాటు టిప్పర్లను నడుపుతున్నారు. మట్టి రోడ్డుపై పడటంతో దుమ్మురేగుతున్నది. రోడ్లు గుంతలమయంగా మారి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.





రామచంద్రాపురంలో మట్టిరోడ్డును తలపిస్తున్న బీటీరోడ్డు, టిప్పర్ల రాకపోకలతో దుమ్ముకొట్టుకుపోయిన అంతర్గత రహదారి

సర్వేను సద్వినియోగం చేసుకోండి

ప్రజాపాలన కేంద్రంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



ప్రజాపాలన కేంద్రంలో వివరాల నమోదును పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వేలో వివరాలు నమోదు చేసుకోని వారి కోసం ప్రభుత్వం మరో అవకాశం ఇచ్చింది, ప్రజాపాలన కేంద్రాల్లో వారందరి వివరాల నమోదు ప్రక్రియ ప్రారంభమైనట్లు మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మెదక్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టోల్‌ఫ్రీ నంబర్ 040 21111111కు ఫోన్‌చేసి కానీ, ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజాపాలన సేవాకేంద్రాల్లో కానీ ఆన్‌లైన్ ఫారం డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. వివరాలు నింపిన తర్వాత ఫారాలను ప్రజాపాలన కేంద్రాల్లో ఇచ్చి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఈ నెల 28 వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేంద్రాలు తెరిచి ఉంటాయని తెలిపారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మెనూ అమలుపై కలెక్టర్ హర్షం

జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ వసతిగృహాలు, గురుకులాలు, పాఠశాలలు, కళాశాలల్లో అమలవుతున్న మెనూ పట్ల కలెక్టర్ రాహుల్‌రాజ్ హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల విద్యాలయాన్ని ఆదివారం కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. వంట కోసం ఉపయోగిస్తున్న కూరగాయలు, పప్పు దినుసులను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి భోజనం రుచికరంగా ఉందా? మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాసంస్థల్లో మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని, మెరుగైన విద్యాబోధన, సరైన వసతి సదుపాయాలు కల్పించాలన్నారు. క్షేత్రస్థాయిలో పాఠశాలలను తనిఖీ చేస్తున్న సమయంలో విద్యార్థుల సామర్థ్యాలు ప్రశ్నలతో సమాధానాలు రాబట్టగా విద్యా నైపుణ్యాలు మెరుగుపడుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు.



చోరీ నిందితుల అరెస్ట్

శివ్వంపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడిన నలుగురు మద్యం మత్తులో పరిశ్రమలో చోరీకి పాల్పడిన ఘన పెద్ద గొట్టిముక్కల గ్రామంలో చోటుచేసుకుంది. మండల పరిధిలోని పెద్దగొట్టిముక్కల శివారులోని భావ్యాస్ ఫార్మాస్యూటికల్స్ ప్రైవేట్ పరిశ్రమ వెనక గేటు నుంచి శనివారం రాత్రి నలుగురు చొరబడి 100 కేజీల స్క్రాప్, 30 మీటర్ల కేబుల్ వైర్లు అపహరించుకుపోయారు. పరిశ్రమ నిర్వాహకుడు మండేపూడి కిరణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా గుమ్మడిదల గ్రామానికి చెందిన వెంకటేష్, ఆంజనేయులు, బ్రహ్మాచారి, ధర్మేందర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా.. నిజం ఒప్పుకున్నారు. దీంతో దొంగిలించిన సొత్తును రికవరీ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

భవిష్యత్తు మనదే..

● కార్యకర్తలతో మాజీ మంత్రి కేటీఆర్

రామాయంపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : అధికారం లేదని ఎవరూ అధైర్యపడకుండా బలంగా పనిచేయాలని, భవిష్యత్ అంతా మనదేనని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఆదివారం రాత్రి ఆయన సిరిసిల్లకు వెళ్లి సిద్దిపేట మీదుగా హైదరాబాద్ వెళ్తూ మార్గమధ్యంలోని రామాయంపేట బైపా‌స్‌లో టీ తాగేందుకు ఆగారు. ఆయన వెంట మాజీ ఎంపీ బాల్క సుమన్, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, రాష్ట్ర బీఆర్ఎస్ నాయకుడు దేవేందర్ రెడ్డి ఉన్నారు. విషయం తెలుసుకున్న కార్యకర్తలు భారీగా తరలి వచ్చి కేటీఆర్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. కేటీఆర్‌ను కలిసినవారిలో మున్సిపల్ మాజీ చైర్మన్ జితేందర్‌గౌడ్, సొసైటీ చైర్మన్ చంద్రం ఉన్నారు.



రామాయంపేటలో నాయకులు, కార్యకర్తలతో కేటీఆర్



రోడ్డుపై వృథాగా పారుతున్న మిషన్ భగీరథ నీరు

వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీళ్లు

● వారంరోజులైనా పట్టించుకోని అధికారులు

నర్సాపూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకు సమీపం నుంచి పట్టణంలోకి వెళ్లే మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్ లీకై.. వారంరోజులుగా నీరంతా వృథాగా పోతోంది. అంతకుముందు కూడా పైపులైన్ లీకవ్వగా.. మున్సిపల్ వారు తాత్కాలిక మరమ్మతులు చేశారు. అయితే రెండురోజులకే అది లీకవ్వడంతో మున్సిపల్ అధికారులపై స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా మరమ్మతు చేయాలని కోరుతున్నారు. ఈ లీకేజీ కూడా మిషన్ భగీరథ డీఈఈ కార్యాలయానికి అతి సమీపంలోనే ఉండటం విశేషం.





















హత్యలు.. హడల్

గత మూడేళ్లలో సంగారెడ్డి జిల్లాలో జరిగిన హత్యలు	2022	2023	2024
హత్యలు	41	53	55
ఆస్తి కోసం జరిగినవి	4	5	10

- మాయమవుతున్న మానవత్వం
- సంగారెడ్డి జిల్లాలో వరుస హత్యల కలకలం
- కారణమేదైనా.. ప్రాణం తీయడమే!
- క్షణికావేశంలో నిర్ణయాలు
- నిండు జీవితాలు జైలుపాలు
- అనాథలవుతున్న చిన్నారులు
- రోడ్డున పడుతున్న కుటుంబాలు



సంగారెడ్డి క్రైం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా హత్యలతో అట్టుడుకుతోంది. ఆర్థిక లావాదేవీలు, ఆస్తి వివాదాలు, వివాహేతర సంబంధాల కారణంగా తరచూ ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. మానవ సంబంధాలు మంట కలిసిపోతున్నాయి. తల్లీ, కొడుకు, కూతురు, తండ్రి, భార్య, భర్త అనే పదాలకు విలువ లేకుండాపోయింది. ఆర్థిక లావాదేవీలే ప్రధాన భూమిక పోషిస్తూ ఈ దారుణాలు చోటు చేసుకుంటున్నాయి. క్షణికావేశంలో తీసుకుంటున్న నిర్ణయాలతో నిండు జీవితాలు జైలుపాలవుతున్నాయి. ఈ ఘటనలతో ఇటు నిందితుల, అటు హతుల కుటుంబాలు రోడ్డు పడుతున్నాయి. కుటుంబ పెద్దలను కోల్పోయి వారి పిల్లలు అనాథలవుతున్నారు. జిల్లాలో ఏటా హత్యా నేరాల సంఖ్య పెరిగిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది.

కూతురుతో సన్నిహితంగా ఉంటున్నాడని..

సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండలం నాగ్‌దర్ రాంచెందర్ తాండాకు చెందిన దశరత్(30)ను నారాయణఖేడ్ మండలం మేఘ్యానాయక్‌తండాకు చెందిన గోపాల్ అనే వ్యక్తి ఈ నెల 12న దారుణంగా హత్య చేశాడు. వివాహితుడైన దశరథ్ తన కూతురుతో సన్నిహితంగా ఉండడం చూసి భరించలేకనే ఈ హత్య చేసినట్లు గోపాల్ అంగీకరించాడు. హత్య అనంతరం అతడి మృతదేహాన్ని దహనం చేసి అనంతరం ముక్కలుగా నరికి ఈదుల్‌తండాలోని అటవీ ప్రాంతంలో గుట్టల మధ్య పడేశాడు. అనంతరం ఏం తెలియనట్లు, ఎవరికీ అనుమానం రాకుండా దశరత్ స్వగ్రామంలోని ఓ మెకను కొనుగోలు చేసి రావడం దృశ్యం సినిమాను తలపించింది.

స్నేహం వికటించి..

తనను అనవసరంగా కేసులో ఇరికించాడని ఓ వ్యక్తి మరో వ్యక్తిని అతి దారుణంగా హత్య చేసిన ఘటన సంగారెడ్డి పట్టణంలో జనవరి 11న చోటు చేసుకుంది. మహారాష్ట్రకు చెందిన షేక్ సమీర్ అమూల్(27) బతుకు దెరువు కోసం సంగారెడ్డికి భార్యాపిల్లలతో వలస వచ్చాడు. సమీర్ పగటి పూట డ్రైవర్ పనిచేస్తూ రాత్రి చోరీలు చేసేవాడు. రాజంపేటకు చెందిన అనీస్ అనే వ్యక్తిని ఓ కేసులో పోలీసులకు చెప్పి ఇరికించాడు. దీన్ని మనసులో పెట్టుకున్న అతడు ఆ రోజు అర్ధరాత్రి సంగారెడ్డి పట్టణంలోని సితార థియేటర్ ఎదురుగా ఖాళీ స్థలంలోకి సమీర్‌ను పిలిపించి కత్తితో గొంతు కోసి దారుణంగా హతమర్చాడు.

ఆస్తికోసం తమ్ముడినే..

ఆస్తి కోసం సొంత తమ్ముడిని అన్న అతి దారుణంగా హత్య చేసిన ఘటన ఈ నెల 14న మునిపల్లి మండలం చీలపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మల్కగోని దుర్గయ్యకు ముగ్గురు కుమారులున్నారు. దుర్గయ్య ఎకరం భూమిని అవసరాల నిమిత్తం ఓ వ్యక్తి వద్ద తాకట్టు పెట్టి డబ్బులు తీసుకున్నాడు. తండ్రి మృతితో తాకట్టు పెట్టిన భూమి విషయంలో కుమారులు ముగ్గురు గొడవపడ్డారు. పెద్ద కుమారుడు యాదయ్య సదరు భూమిని తాకట్టు నుంచి విడిపించి తన భార్య పేరిట రిజిస్ట్రేషన్ చేయించాడు. ఈ విషయంలో అన్నదమ్ములు యాదయ్య, శివయ్యలు ఘర్షణపడ్డారు. ఈ క్రమంలో ఆగ్రహానికి గురైన యాదయ్య తన తమ్ముడు శివయ్యను బండ రాయితో బలంగా కొట్టగా తీవ్రంగా గాయపడి మృతి చెందాడు.

ప్రాణం తీసిన వివాహేతర సంబంధం..

ఓ మహిళతో వివాహేతర సంబంధం ఉందన్న నెపంతో అందోల్ మండలం తాలెల్మ శివారులో ఓ యువకుడిని అతి దారుణంగా గుర్తు తెలియని దుండగులు హత్య చేసిన ఘటన జనవరి 12న జరిగింది. నాదులాపూర్‌కు చెందిన కర్రోళ్ల శ్రీనివాస్(30)కు ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడన్న కారణంతో దుండగులు అతడి గొంతు కోసి, బండరాయితో తలపై మోది దారుణంగా హతమర్చారు.



దంపుయార్డు ముట్టడికి ప్రయత్నిస్తున్న ఎమ్మెల్యే సునితారెడ్డి, మహిళలు

డంపుయార్డును ఏర్పాటు చేయొద్దు

● గుమ్మడిదల కొనసాగుతున్న ఆందోళనలు

గుమ్మడిదల, ఫిబ్రవరి 16 (ఆంధ్యజ్యోతి) : మండలంలోని ప్యారానగర్‌లో డంపుయార్డు ఏర్పాటు చేయొద్దంటూ స్థానికులు కోరారు. ఈ మేరకు చేపట్టిన నిరసనలు ఆదివారం కూడా కొనసాగాయి. జేఏసీ కన్వీనర్ చిమ్ముల జైపాల్ రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు అమ్మగారి సదానందరెడ్డి అధ్వర్యంలో గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలో దళిత సంఘాలు రిలే నిరహార దీక్ష చేపట్టారు. నల్లవల్లి, కొత్తపల్లిలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మహిళా సంఘాల నేతృత్వంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునితారెడ్డితో కలిసి పెద్ద ఎత్తున మహిళలు డంపుయార్డు ముట్టడికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. డంపుయార్డుతో పర్యావరణ కాలుష్యం పెరిగి ప్రజా ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే ప్రమాదముందని, ప్రభుత్వం పునరాలోచించి నిర్ణయాన్ని విరమించుకోవాలని నినాదించారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని జేఏసీ నేతలు హెచ్చరించారు.

నర్సాపూర్‌లోనూ జేఏసీ.. నేటి నుంచి రిలే దీక్షలు

నర్సాపూర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా నల్లవల్లి ప్రాంతంలోని ప్యారానగర్ వద్ద ఏర్పాటు చేయనున్న హెచ్‌ఎండీఏ డంపుయార్డుకు వ్యతిరేకంగా నర్సాపూర్‌లోనూ జేఏసీ ఏర్పాటైంది. ఈ మేరకు ఆదివారం స్థానిక బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎం నాయకులు సమావేశమై నేటి నుంచి రిలే దీక్షలతోపాటు నిరసనలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డంపుయార్డుతో ఎక్కువగా నష్టపోయేది ఈ ప్రాంతమేనని, ఎట్టి పరిస్థితుల్లోనూ దాని ఏర్పాటును అడ్డుకునేందుకు అందరం కలిసికట్టుగా ఉద్యమిస్తామన్నారు. సమావేశంలో ఆయా పార్టీల నాయకులు రమణారావు, గోడ రాజేందర్, బుచ్చేస్‌యాదవ్, శ్రీధర్‌గుప్తా, భిక్షపతి, అంజిగౌడ్, జ్ఞానేశ్వర్, రిజ్వాన్, అజ్మత్, యాదగిరి, రామంచందర్, దావుద్, కొత్త శ్రీనివాస్, దావుద్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

వేర్వేరు చోట్ల ఘటనలు... పలువురికి తీవ్ర గాయాలు

- కొండపాకలో ఆగి ఉన్న డీసీఎంను ఢీ కొట్టిన కారు
- ఒకరు మృతి, నలుగురికి తీవ్ర గాయాలు
- గజ్వేల్‌లో రెండు కార్లు ఢీకొని ఒకరు దుర్మరణం
- రామాయంపేటలో బైక్ ఢీకొని పాదాచారి



కొండపాక : డీసీఎంను ఢీకొన్న ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న పాలయ్య, మమత, భీమయ్య, మమత



కొండపాక : డీసీఎం వ్యాన్ కు ఢీ కొట్టిన కారు, సురేశ్ మృతదేహం

కొండపాక, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుపై ఆగి ఉన్న డీసీఎంను కారు ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా, నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. జగద్గిరిగుట్టకు చెందిన ఐదుగురు కుటుంబ సభ్యులు చండె భీమయ్య (38), సురేష్(36), మమత(32), మమత(30), పాలయ్య(60) కారులో సిర్పూర్ కాగజ్‌నగర్‌కు వెళ్తున్నారు. కొండపాక మండలం కొమురవెల్లి కమాన్ సమీపంలోగా రాగనే రాజీవ్ రహదారిపై నిలిచి ఉన్న డీసీఎంను వీరి కారు బలంగా ఢీకొట్టింది. దీంతో సరేష్ అక్కడికక్కడే మృతి చెందగా, మిగతా నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది అక్కడికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పాలయ్య, మమతల పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు తెలిపారు.

రెండు కార్లు ఢీకొని..



గజ్వేల్ రూరల్ : వెంకటేశ్ మృతదేహం

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వచ్చిన రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందగా మరో నలుగురికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని గజ్వేల్ - పిడిచెడ్ మార్గంలో ఆదివారం చోటుచేసుకుంది. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిదిలోని కొల్గూరు గ్రామానికి చెందిన వెంకటేష్‌తో పాటు అతని బంధువులైన గొట్టిముక్కల గ్రామానికి చెందిన వెంకటేష్, నాని, సాయిగౌడ్‌లు గజ్వేల్ నుంచి కారులో కొల్గూరు వైపు వస్తున్నారు. జనగాం జిల్లా కేశిరెడ్డిపల్లికి చెందిన సాయి పని ఉండగా మిరుదొడ్డి వెళ్లాడు. అక్కడి నుంచి బయ్యారంవైపు వస్తున్నారు. జనగాం జిల్లా కేశిరెడ్డిపల్లికి చెందిన సాయి పని ఉండగా మిరుదొడ్డి వెళ్లాడు. అక్కడి నుంచి బయ్యారం చౌరస్తా మీదుగా మేథినీపూర్ వచ్చేందుకు బయలుదేరారు. ఈ క్రమంలో గజ్వేల్ పిడిచెడ్ మార్గంలోని పత్తి మిల్లుల సమీపంలో ఎదురెదురుగా వచ్చిన రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో వెంకటేష్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ ఈఎంటీ వర్షిత, లక్ష్మణ్, రాజు, పైలెట్స్ నరేష్, ప్రభాకర్‌లు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులు గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ఢీకొని యువకుడు..



నవీన్(ఫైల్)

రామాయంపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : బైక్ ఢీకొనడంతో యువకుడు మృతిచెందిన సంఘటన రామాయంపేట పాత హైవే కామారెడ్డి దారిలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన కాస నవీన్(28) శనివారం రాత్రి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో వెనుక నుంచి బైక్‌పై వేగంగా వచ్చిన ఓ యువకుడు అతన్ని బలంగా ఢీకొట్టడంతో నవీన్‌కు తీవ్ర గాయాలయ్యారు. దీంతో అతడిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రిని కొడుతుంటే అడ్డుకునేందుకు వెళ్లిన

బాలికకు తీవ్ర గాయాలు

● చికిత్స పొందుతూ మృతి

మునిపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): తండ్రిని కొందరు వ్యక్తులు కొడుతున్నారని ఆపేందుకు వెళ్లిన బాలికను వాళ్ల నెట్టేయడంతో గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలో చోటుచేసుకుంది. మునిపల్లి ఎస్ఐ రాజేష్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం ఓ గ్రామానికి చెందిన మహ్మద్ ఇస్మాయిల్ ఈ నెల 11న గ్రామంలోని వీరారెడ్డి ఇంటి సమీపంలో ఖాళీ స్థలంలో మూత్ర విసర్జన చేస్తున్న క్రమంలో వీరారెడ్డి, దాయాది విజయ్‌రెడ్డి ఇక్కడ మూత్రం ఎందుకు పోస్తున్నావంటూ బూతు మాటలు తిడుతూ చొక్కా పట్టుకుని కొట్టారు. ఇస్మాయిల్ వారిని నెట్టేశాడు. గొడవ జరుగుతుండగా గమనించిన ఇస్మాయిల్ పదిహేనేళ్ల కూతురు వారిని ఆపేందుకు వెళ్లగా తోసేశారు. ఈక్రమంలో ఇస్మాయిల్‌తోపాటు ఆ బాలికకు మూగ దెబ్బలు తగిలాయి. అదేరోజు రాత్రి పెద్దచెల్మెడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఇద్దరూ చికిత్స చేయించుకున్నారు. మరుసటి రోజు (ఈ నెల 12న) బాలిక శారీర భాగాల్లో నొప్పి రావడంతో బుదేరాలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ బాలిక ఆదివారం మృతి చెందినట్లు ఎస్ఐ వెల్లడించారు. మృతురాలి తండ్రి మహ్మద్ ఇస్మాయిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బావిలో పడి వృద్ధుడి మృతి



యాదగిరి(ఫైల్)

ములుగు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : చేపల వేటకు వెళ్లిన వృద్ధుడు బావిలో పడి మృతి చెందిన సంఘటన తునికిబొల్లారంలో చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం ములుగు మండలం మామిడాల గ్రామానికి చెందిన బొమ్మ యాదగిరి(60) ఆదివారం ఉదయం బొల్లారం గ్రామ శివారులోని ఓ బావిలో చేపలు పట్టడానికి వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడి మృతిచెందాడు. బావిగట్టుపై మృతుడి చెప్పులు, బట్టలు ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న వారు మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తాళం వేసిన ఇళ్లలో చోరీ

చేర్యాల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం ముస్త్యాల గ్రామంలో తాళం వేసిన ఇళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన కేశిరెడ్డి బాల్‌రెడ్డి అనారోగ్యానికి గురికావడంతో హైదరాబాదులోని తమ కుమారుడి ఇంటికి వెళ్లాడు. తాళంవేసి ఉండటంతో ఆగంతకులు ఇంట్లోకి చొరబడి అరతులం బంగారం, రూ.10వేలు నగదు అపహరించుకుపోయారు. సమీపంలోనే ఉన్న బొలుగం లక్ష్మి ఇంట్లోనూ వారు చోరికి యత్నించినా నగదు, ఆభరణాలు లభ్యంకాకపోవడంతో వస్తువులు చిందరవందర పడేసి వెళ్లిపోయారు. అలాగే ఇదే గ్రామంలోని మరొకరి ఇంట్లో చోరీకి యత్నించారు. తాళాలు వేసి ఉన్న ఇంటితలుపులు అనుమానాస్పదంగా ఉండటాన్ని గమనించిన స్థానికులు వారికి సమాచారం అందించడంతో వచ్చారు. ఈ విషయమై పోలీసులకు తెలపడంతో క్లూస్ టీంను రప్పించి వేలిముద్రల నమూనా సేకరణ చర్యలు తీసుకున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



వేలిముద్రల నమూనా సేకరణకు యత్నిస్తున్న క్లూస్ టీం

రబీలో ఆరుతడి

పంటల సాగుపై రైతుల ఆసక్తి

● బోరుబావుల్లో ఉన్న కొద్దిపాటి నీటితోనే పంటలు

నాగల్ గిద్ద, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ బోరు బావుల్లో ఉన్న కొద్దిపాటి నీటితో రబీలో రైతులు ఆరుతడి పంటల సాగుకు ఆసక్తి చూపుతున్నారు. నాగల్‌గిద్ద మండలంలో మంజీరా నది పరీవాహక ప్రాంతంలో రైతులు మంజీరా నుంచి పైప్‌లైన్ వేసుకొని చెరకు, గోదుమ, ఉల్లి, వంటి పంటలు సాగు చేస్తున్నారు. ఇరక్‌పల్లి, ఏనక్‌పల్లి, నాగల్‌గిద్ద, ఔదత్‌పూర్ తదితర గ్రామాల్లో వ్యవసాయ బోరుబావుల్లో ఉన్న నీటితోనే పంటలను పండిస్తున్నారు. కొన్నిచోట్ల మొక్కజొన్న, గోదుమ, ఉల్లి, ఆకుకూరలు, తదితర పంటల సాగు చేస్తున్నారు. ఆరుతడి పంటల సాగులో తక్కువ పెట్టుబడులకు ఎక్కువ లాభాలు రావడంతో రైతులు రబీలో ఆరుతడి పంటల సాగు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. తక్కువ కాలంలో పంటలు చేతికి అందడంతో పాలకూర, మెంతి, తోటకూర, వంటి పంటలనూ సాగు చేస్తున్నారు.

రబీలో ఆరుతడి పంటలతోనే లాభాలు

రబీలో ఆరుతడి పంటలతోనే అధిక లాభాలు వస్తాయని దీని వల్ల తక్కువ నీరు, తక్కువ పెట్టుబడులు, అధిక లాభభాలు వస్తాయి. ఒక ఎకరంలో ఉల్లి గడ్డ 35 నుండి 40 క్వింటాళ్లు వస్తుంది. అధికారుల సలహాలతో ఆరుతడి పంటలు సాగు చేస్తున్నాం.

- ధన్‌రాజ్, రైతు, ఔదత్‌పూర్

అలరించిన అవధానాలు

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేటలోని శ్రీ లలిత చంద్రమౌళీశ్వర దేవస్థానంలో మాసోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన సాహిత్య కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. అవధాని మారెపల్లి పట్వర్ధన్ ఒకే రోజు ఆరు అష్టావధానాలు చేసి అలరించారు. ఆదివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి రాత్రి వరకు సాగింది. ఒకేరోజు ఆరు అవధానాలు జరుగడంపై సిద్దిపేట సాహిత్య ప్రియులు ఆనందం వ్యక్తం చేశారు. పద్యసాహిత్యం అవధానాల మూలంగా పరిడవిల్లుతుందన్నారు. ఆలయ నిర్వాహకులు పండరి రాధాకృష్ణ అవధానంలో పృచ్ఛకులుగా ఉండ్రాళ్ల రాజేశం, ముద్దు రాజయ్య, నల్ల అశోక్, వేదాల గాయిత్రిదేవి, భ్రమరాంబిక, అరవెల్లి శ్రీదేవి, నాగేశ్వరావు, మచ్చ అనురాధ, సంధ్యారాణి, వెంకటేశ్వర్లు, సింగీతం నరసింహారావు, అష్టకాల విద్యాచరణ్, దుడుగు నాగలత, బస్వ రాజ్ కుమార్, మల్లంపల్లి శిరీష, భావన, మాధవీలత, వరుకోలు లక్ష్మయ్ తదితరులు పాల్గొన్నారు.



లలితా చంద్రమౌళీశ్వరాలయంలో అష్టావధానం



మోదుగు మురిపెం..

● విరబూసిన పూలు

కోహీర్, ఫిబ్రవరి 16ః (ఆంధ్రజ్యోతి) : ఆకులన్నీ రాలిపోయి మోడు బారిన మోదుగు చెట్టుకు అరుణ వరుణంలో పూలు విరబూసి కొత్తందాన్ని తెచ్చిపెడుతున్నాయి. అటుగా రాకపోకలు సాగించేవారిని ఇట్టే ఆకర్షిస్తూ కనువిందు చేస్తున్నాయి. కోహీర్ మండలంలోని సజ్జాపూర్, బిలాల్‌పూర్, మనియర్‌పల్లి, బడంపేట, పర్శపల్లి, గోటిగర్‌పల్లి పిచేర్యాగడి, గ్రామాలలోని అటవీ ప్రాంతాలలో మోదుగు చెట్లు అధికంగా ఉన్నాయి. ఈ కాలంలో నిలువెల్లా ఎర్రని పూలతో ఆ చెట్లు మెరిసిపోతున్నాయి. హోలీ రోజున మోదుగు పువ్వులను మరుగ కాచి స్వచ్ఛమైన రంగులను తయారుచేసుకొని పరస్పరం చల్లుకుంటారు. అంతేకాకుండా మోదుగ ఆకులతో మనం భోజనం చేసే ఇస్తార్లు తయారు చేస్తారు. అ చెట్టు వేర్లు దాని నారుతో తాళ్లు, వివిధ వస్తువులు తయారు చేస్తారు. దీని పసరుతో ఆయుర్వేద మందులు తయారు చేస్తారు. ఈ పూలు శివుడికి అత్యంత ప్రీతి. మహాశివ రాత్రి రోజు ఈపూలతో పూజిస్తారు. మోదుగు పూలు జనవరి నెల అరంభం నుంచి మార్చి నెల ఆఖరు వరకు పూస్తుంటాయి.



పుట్టెడు దుఃఖంలోనూ భర్త అవయవాలు దానం

● పలువురికి ప్రాణదానం



నాగేంద్ర(ఫైల్)

రాయపోల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు భవిష్యత్తు అంధకారం, మరో వైపు పిల్లల పెంపకం ఎలా అనే ఆవేదన ఇలాంటి దిక్కుతోచని పరిస్థితిలో ఉన్న ఓ మహిళ బ్రెయిన్ డెడ్ అయిన తన భర్త అవయవాలను దానం చేసి గొప్ప మనస్సును చాటుకుంది. వివరాల్లోకి వెళితే రాయపోల్ మండలం పెద్దారెపల్లి గ్రామానికి చెందిన కోంపల్లి నాగేంద్ర(34), లావణ్య దంపతులకు ఐదేళ్ల లోపు ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. నాగేంద్ర గజ్వేల్‌లోని ఓ రైస్ డిపోలో పనిచేస్తుండగా లావణ్య గ్రామంలో కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో ఈ నెల 2న రాత్రి నాగేంద్ర గజ్వేల్‌లో పనిముగించుకొని బైక్‌పై పెద్దారెపల్లికి వెళ్తున్న క్రమంలో బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు వెంటనే ఆయనను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స నిర్వహించినప్పటికీ ఫలితం లభించలేదు. ఆదివారం బంధువుల సూచన మేరకు నాగేంద్ర అవయవాలను దానం చేసేందుకు భార్య లావణ్య, తల్లి బాలవ్వ అంగీకరించారు. దీంతో వైద్యులు నాగేంద్ర శరీరం నుంచి అవసరమైన అవయవాలను తీసుకున్నారు.

న్యూస్ బాక్స్

జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

మెదక్ కల్చరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీరాజ్ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం మెదక్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సోమేష్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సామ్యూల్, ప్రధాన కార్యదర్శిగా కుర్షీద్, అసోసియేట్ అధ్యక్షుడిగా సిద్ధిరాములు, కోశాధికారి దుబ్బరాజము, ఉపాధ్యక్షుడిగా వెంకటేశం, సహాయ కార్యదర్శిగా ఇస్సాక్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా ప్రభాకర్, ఫణిరాజ్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాషా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రాథమిక స్కౌట్స్ మాస్టర్, గైడ్ కెప్టెన్ శిక్షణ

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో 10 నుంచి జిల్లా కేంద్రంలోని స్టేడియంలో నిర్వహించిన బేసిక్ స్కౌట్స్ మాస్టర్, గైడ్ కెప్టెన్ శిక్షణ ఆదివారం ముగిసింది. స్టేట్ ట్రైనింగ్ కమిషనర్లు, మోహన్‌రావు, వెంకటరమణమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణకు జిల్లావ్యాప్తంగా 55 పాఠశాలల నుంచి పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొనగా.. ఇందులో 36 మంది స్కౌట్ మాస్టర్స్, 19 మంది గైడ్ కెప్టెన్‌లుగా శిక్షణ పొందినట్లు జిల్లా కార్యదర్శి రాజేందర్ తెలిపారు.

గ్రౌండ్‌లో లైట్ల ఏర్పాటు

నర్సాపూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ పట్టణంలోని జూనియర్ కాలేజీ మైదానంలో రోజూ సాయంత్రం పూట వాకింగ్ చేసేవారు చీకటితో ఇబ్బందిపడుతుండడంతో స్థానిక వ్యాపారి పైడి శ్రీధర్ గుప్తా తన సొంత నిధులతో ఆదివారం లైట్లు అందజేశారు. దీంతో వాకర్లు శ్రీధర్‌గుప్తాకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రమణరావు, గోడ రాజేందర్ పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

నారాయణఖేడ్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 11 గంటలకు ఏరియా వైద్యశాలలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ నాయకులు ఆదివారం తెలిపారు.

విహారయాత్రకు వెళ్లిన విద్యార్థులు

వెల్దుర్తి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన వెల్దుర్తి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య ఆధ్వర్యంలో ఆదివారం విజ్ఞాన విహారయాత్రకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విహారయాత్రల వల్ల విద్యార్థుల్లో విజ్ఞానం పెరుగుతుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన డబ్బులతో విద్యార్థులను వరంగల్‌లోని వేయి స్తంభాల గుడి, రామప్ప ఆలయం, కీల, లక్నవరం వంటివి సందర్శించి వాటి విశిష్టతను విద్యార్థులకు వివరించామన్నారు.

క్రైం కార్నర్

తాళ్లపల్లి తండాలో వ్యక్తి అదృశ్యం



రాంచందర్ (ఫైల్)

శివ్వంపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఇంటివద్ద ఉన్న వ్యక్తి అదృశ్యమైన సంఘటన శివ్వంపేట మండల పరిధిలోని తాళ్లపల్లితండాలో చోటు చేసుకున్నది. తండాకు చెందిన ధనావత్ రాంచందర్(37) దినసరి కూలి. ఈనెల 11న సాయంత్రం భార్య విజయ పని నిమిత్తం శివ్వంపేటకు వెళ్లగా.. రాంచందర్ ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. సుమారు 6.30 గంటలకు భార్య ఇంటికిరాగా రాంచందర్ కనిపించలేదు. ఫోన్‌చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో ఆందోళన భార్య చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

రూ.33 కోట్లతో వంతెన నిర్మాణం

- తీరనున్న అవుటర్ అనుబంధ రోడ్డు సమస్య
- ఐటీ కారిడార్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు ప్రయోజనం
- మూడు మున్సిపల్ పట్టణాల ప్రజలకు ఊరట



నిర్మాణంలో ఉన్న అవుటర్ రైల్వేట్రాక్ పైవంతెన

రామచంద్రాపురం టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల మధ్య బంధాలు చెరిపేసిన అవుటర్ అనుబంధ రోడ్డు సమస్యకు పరిష్కారం లభించే విధంగా ప్రత్యేకంగా వంతెన నిర్మాణం చేపట్టారు. దీనివల్ల గచ్చిబౌలి ప్రాంతంలో పనిచేస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు రోజువారి ప్రయాణం చేయడానికి అవకాశం లభించింది. 10 ఏళ్లుగా పోరాటం చేసిన వెలిమెల గ్రామస్థుల కల నెరివేరింది. తెల్లాపూర్ పురపాలక పరిధి కొల్లూరు అవుటర్ సర్వీస్ రోడ్డు లింకు కొల్లూరు జంక్షన్ నుంచి పాటి గ్రామ రోడ్డు వరకు కలపకుండా నిలిపివేశారు. దీనిపై అవుటర్ నిర్మాణం జరుగుతున్న సమయంలో అప్పటి ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్, ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి నాటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. అయినా అనుబంధ లింకు కలపడానికి అవుటర్ గుత్తేదారుడు ఇష్టపడలేదు. ఐదేళ్ల క్రితం ఆగ్రహించిన గ్రామస్థులు రోడ్డుపై ధర్నాలు చేశారు. అనంతరం అవుటర్ ప్రధాన రోడ్డుకు ఆనుకొని 20 అడుగుల రోడ్డును వంతెన తరహాలో వదిలారు. అది వర్షాలు కురిసిన సందర్భాల్లో కొట్టుకుపోయేది. ఇటీవల ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డితో కలిసి హెచ్‌ఎండీఏ అధికారులతో చర్చలు జరిపారు. రైల్వేట్రాక్ పైవంతెన నిర్మాణానికి ప్రతిపాదించారు.

ఆరునెలల్లో పనులు పూర్తి

ఐటీ కారిడార్‌కు సంబంధించిన ఉద్యోగులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నేరుగా సర్వీస్ రోడ్డును సుల్తాన్‌పూర్ వరకు వినియోగించుకునేందుకు సౌలభ్యం కల్పించారు. ఇందుకు అడ్డంకిగా మారిన రైల్వే పట్టాపై వంతెన నిర్మాణానికి సర్వే పూర్తిచేసి రూ.33 కోట్ల అంచనా వ్యయం ప్రకటించారు. రైల్వేశాఖ అనుమతులు మంజూరు చేసింది. హెచ్‌ఎండీఏ అధికారులు అరబిందో భాగస్వామ్యంతో వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. ఆరునెలల కాలవ్యవధిలో నిర్మాణం పూర్తవుతుందని గుత్తేదారుడు చెప్పారు. అవుటర్‌కు రెండువైపులా ఆరు వరుసల సర్వీస్ రహదారులు నిర్మిస్తున్నారు. రోడ్డు పనులు పూర్తయితే తెల్లాపూర్, అమీన్‌పూర్, ఐడీఏబొల్లారం పురపాలక పట్టణాల్లో నివాసముంటున్న ఐటీ ఉద్యోగులకు ప్రయోజనకరంగా మారనున్నది. కొల్లూరు, ఈదులనాగులపల్లి, వెలిమెల గ్రామస్థులు రోజువారి కార్యక్రమాలకు రోడ్డు ఉపయోగపడుతుంది.

నకిలీ డాక్టర్లు.. అనుమతి లేని వైద్యం

5వ పేజీ తరువాయి

సుమారు 500 మంది వరకు ఆర్‌ఎంపీ, పీఎంపీలుగా చలామణీ అవుతున్నట్లు తెలుస్తోంది.

తనిఖీలు తూచ్

వైద్య ఆరోగ్యశాఖ అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న క్లినిక్లలో వైద్య ఆరోగ్యశాఖ తనిఖీలు చేసిన దాఖలాలు కానరావడం లేదు. ఎక్కడైనా ఏదైనా సంఘటన జరిగితే నామమాత్రంగా దాడులు చేస్తున్నారనే తప్ప పూర్తిస్థాయిలో కట్టడి చేయలేకపోతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నకిలీ డాక్టర్లను అరికట్టడానికి ఉద్దేశించిన క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం అమలుకు నోచుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించి అర్హతకు మించి, అనుమతి లేని వైద్యం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వైద్య నిపుణులు కోరుతున్నారు.

నకిలీ డాక్టర్లపై నిఘా



అర్హత లేకపోయినా డాక్టర్లుగా అవతారమెత్తి వైద్య చికిత్సలు చేస్తే చర్యలు తప్పవు. ఇప్పటికే నకిలీ డాక్టర్లు, అనుమతి లేని ప్రైవేటు వైద్యశాలలపై నిఘా ఉంచాం. తనిఖీల్లో విద్యార్హత లేకుండా డాక్టర్‌గా చెలామణి అయినట్లు తేలితే కేసులు నమోదు చేయిస్తాం. ఆస్పత్రులు, క్లినిక్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్ల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి. డాక్టర్ వృత్తికే మచ్చతెచ్చేలా ఎవరు వ్యవహరించినా సుమోటోగా తీసుకొని చర్యల కోసం సంబంధిత అధికారులకు సిఫారసు చేస్తాం.

- ఎస్.ఆనంద్, టీజీఎంసీ మెంబర్, సంగారెడ్డి జిల్లా

పారిశ్రామికవాడల్లో రోడ్లపైనే వాహనాల పార్కింగ్

- ప్రత్యేకంగా లేని పార్కింగ్ స్థలాలు.. ప్రయాణికుల ఇక్కట్లు
- రోడ్ల పక్కనే షెడ్లు వేసిన పలు పరిశ్రమలు



కాజీపల్లి పారిశ్రామికవాడలో రోడ్డుపైనే నిలిపిన లారీలు

జిన్నారం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జిన్నారం మండలంలోని గడ్డపోతారం, కాజీపల్లి, బొల్లారంలోని పలు పారిశ్రామికవాడల్లో వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాలు లేక రహదారులపైనే భారీ వాహనాల నిలుపుతున్నారు. దీంతో ప్రయాణికులు ప్రమాదాల బారినపడుతున్నారు. కొన్నిచోట్ల సీసీరోడ్ల పక్కనే ద్విచక్ర వాహనాల పార్కింగ్ కోసం షెడ్లు వేశారు. ముఖ్యంగా ఆయా పరిశ్రమల కోసం ఇతర ప్రాంతాల నుంచి సరుకులు తెచ్చే లారీలు, కంటైనర్స్, నీటి ట్యాంకర్లు సహా ఇతర వాహనాలు రోడ్లపైనే నిలిపేస్తున్నారు. మూడు పారిశ్రామికవాడలకు నిత్యం వందలాది సంఖ్యలో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నా.. ఆయా పరిశ్రమలు పార్కింగ్‌కు స్థలం కేటాయించడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అర్హులకు అందని రైతు భరోసా

- మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం మూడు ఎకరాలలోపు రైతులందరికీ రైతుభరోసా ఇచ్చినట్లు గొప్పలు చెబుతున్నా.. అర్హులైనవారికి అందలేదని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతుభరోసా ద్వారా ఎకరాకు రూ.15 వేల చొప్పున ఇస్తామని చెప్పి, అధికారంలోకి రాగానే రూ.12 వేలే ఇస్తామని తెలుపుతూ.. అర్హులైన రైతులందరికీ ఇవ్వడం లేదన్నారు. రుణమాఫీ మాదిరిగానే రైతుభరోసా విషయంలోనూ అర్హులకు అన్యాయం జరుగుతుందని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం.. అర్హులందరికీ రైతుభరోసా అందేవిధంగా చర్యలు తీసుకోవాలని, లేకపోతే రైతుల పక్షాన ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామని భూపాల్‌రెడ్డి హెచ్చరించారు.

పల్లె ప్రకృతివనంపై ఇంత నిర్లక్ష్యమా..?

- నిర్వహణ లోపంతో ఎండిపోతున్న మొక్కలు



తగలబడిన ప్రకృతివనంలోని మొక్కలు

రామచంద్రాపురం టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : తెల్లాపూర్ పురపాలక పరిధి కర్దనూరు గ్రామంలో పల్లె ప్రకృతివనంలో భాగంగా మొక్కల పెంపకం చేపట్టారు. దీంట్లో ప్రకృతికి సంబంధించిన అన్నిరకాల ఆయుర్వేద మొక్కలు పెంచి ఆదర్శంగా తీర్చిదిద్దాలని గతంలో కలెక్టర్‌గా పనిచేసిన హనుమంతరావు సంకల్పించారు. కాలక్రమేణా గ్రామం మున్సిపాలిటీలో కలవడతో నిర్వహణ మరిచారు. నర్సరీని సైతం గాలికొదిలేశారు. మొక్కలకు నీరు పోయడం ఆపేయడంతో ఏపుగా పెరిగిన చెట్లు ఎండిపోతున్నాయి. ఇందులో కొన్ని నిప్పురవ్వలు అంటుకుని తగలబడిపోయాయి. దాన్ని శుభ్రం చేసి మళ్లీ మొక్కలు నాటాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో పిచ్చిమొక్కలు పెరిగి వనం కళావిహీనంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పల్లె ప్రకృతివనంలో మొక్కలు ఎండిపోకుండా చూడాలని కోరుతున్నారు.

ప్రకృతివనం.. కనిపించని పచ్చదనం

- నిర్వహణ లోపంతో మోడువారిన మొక్కలు
- పట్టించుకోని అధికారులు



ఇందిరాపురి కాలనీలో పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న ప్రకృతివనం

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణాల్లో ప్రకృతి పచ్చదనం కనిపించేలా గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన పథకాలు అధికారుల నిర్లక్ష్యంతో నీరుగారిపోతున్నాయి. మున్సిపాలిటీల్లో ప్రభుత్వ ఖాళీస్థలాలు, వెంచర్లలో మున్సిపాలిటీకి చెందిన స్థలాలను గుర్తించి పట్టణ ప్రకృతివనాలుగా ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రమైన మెదక్ మున్సిపల్ పరితతధిలో ఇందిరాపురి, చిత్రాంజలి, టీచర్స్ కాలనీల్లో పట్టణ ప్రకృతివనాలను ఏర్పాటు చేశారు. చుట్టూ ఫెన్సింగ్ వేయడానికి సుమారు రూ.15 లక్షలకు పైగానే ఖర్చు చేశారు. అంతా బాగానే ఉన్నా.. నాటిన మొక్కలు ప్రస్తుతం కనిపించకుండాపోయాయి. చిత్రాంజలి, ఇందిరాపురి కాలనీల్లో పిచ్చి మొక్కలతో మోడిబారిపోయి దర్శనమిస్తున్నాయి. చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసినా.. నిర్వహణ కొరవడటంతో మొక్కలన్నీ కనిపించకుండా పోయి పచ్చదనం వెక్కిరిస్తోంది. ఇందిరాపురి కాలనీలో చుట్టూ ఫెన్సింగ్ వేసి గేటు ఏర్పాటు చేయడం మరిచిపోయారు. దీంతో అక్కడ నాటిన మొక్కలన్నీ పశువులకు మేతగా మారాయని స్థానికులు వాపోతున్నారు. మొక్కల నిర్వహణకు ప్రత్యేకంగా ప్రైవేట్ లేబర్లను రోజువారి విధానంలో ఏర్పాటు చేసినా ఫలితం కనిపించడం లేదు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు దృష్టిసారించి పట్టణ ప్రకృతివనాలు పచ్చదనంతో నిండిపోయే అవకాశం ఉంది.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



చేగుంట: స్వామివారికి పట్టువస్త్రాల సమర్పిస్తున్న భక్తులు



సికింద్లాపూర్ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి



పాపన్నపేటలో హనుమాన్ ప్రతిష్ఠాపనలో మాధవానంద సరస్వతీస్వామి

మెదక్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : చేగుంట మండలం బీకొండాపూర్ సింగరాయగుట్ట లక్ష్మీనరసింహస్వామి 65వ వార్షికోత్సవంలో భాగంగా మూడోరోజు స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం మహా పూర్ణాహుతి, కుంభప్రోక్షణ, స్వామివారి ఎదుర్కోలు, బలిహారం కార్యక్రమాలు నిర్వహించారు. చేగుంట మండల ప్రజలతో పాటు దుబ్బాక, రామాయంపేట, మిరుదొడ్డి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆయనను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు.

ప్రసన్నాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

పాపన్నపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : సంస్థాన్ పాపన్నపేటలో ప్రసన్నాంజనేయస్వామి పునఃప్రతిష్ఠాపన మూడురోజులు వైభంగా జరిగాయి. మాఘ చవితిని పురస్కరించుకుని ఆదివారం వేదబ్రాహ్మణులు శిలాంకోట ప్రవీణ్‌శర్మ ఆధ్వర్యంలో.. అనంతచార్య, అరవిందశర్మ, నికేతన్‌శర్మ, దిగంబరశర్మ, విశ్వనాథంశర్మ, నవీన్‌శర్మ పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభ, ప్రాణ ప్రతిష్ఠ, పూర్ణాహుతి హోమం నిర్వహించారు. రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీస్వామి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్సవాల్లో మెదక్ మాజీ ఎమ్మెల్యేలు శశిధర్‌రెడ్డి, పద్మారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి పాల్గొన్నారు. కాగా మధ్యాహ్నం కూరగాయల మార్కెట్ భవనంలో అన్నప్రసాద వితరణ చేపట్టారు.

ద్వితీయ వార్షికోత్సవాలకు బగళాముఖి ఆలయం ముస్తాబు

శివ్వంపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన శివ్వంపేటలో కొలువైన దశ మహా విద్యల్లో ఒకటైన శక్తిపీఠం బగళాముఖి అమ్మవారి ఆలయం ద్వితీయ వార్షికోత్సవాలకు ముస్తాబైంది. ఆలయ వ్యవస్థాపకుడు వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం అగ్నిప్రతిష్ఠ, బగళాముఖి మహామంత్రావనం, 108 కలశస్థాపన అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ ట్రస్టీ మెంబర్ శివకుమార్‌గౌడ్, మహేష్‌గుప్తా తెలిపారు.

లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

శివ్వంపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సికింద్లాపూర్ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఐదో ఆదివారం సందర్భంగా ఆలయ ప్రధాన పూజారి ధనుంజయశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి పవిత్ర కోనేరులో పుణ్య స్థానాలు ఆచరించి, మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా కార్య నిర్వహణ అధికారి శశిధర్‌గుప్తా ఏర్పాటను పర్యవేక్షించారు.

ముగిసిన సమ్మక్క, సారలమ్మ జాతర

శివ్వంపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్కల శివారులో లక్ష్మాపూర్ రోడ్డులోని అటవీ ప్రాంతంలో, చాకరిమెట్ల ఆంజనేయస్వామి ఆలయానికి సమీపంలో నాలుగు రోజుల సమ్మక్క, సారలమ్మ జాతరను పూజారి శశికళనర్సింహులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ జాతర ఆదివారంతో ముగిసింది. ఇందులో ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎంపీపీ హరికృష్ణ, చంద్రాగౌడ్, యాదాగౌడ్ పూజలు నిర్వహించారు.

గ్రామ దేవతలకు బోనాలు

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : రేణుకాఎల్లమ్మ 31వ ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం పట్టణ గౌడ సంఘం ఆధ్వర్యంలో గ్రామ దేవతలైన నల్లపోచమ్మ, ముత్యాలమ్మ, గట్టమ్మ, బోరంచమ్మ అమ్మవార్లకు ఘనంగా బోనాలు తీశారు. 18న రేణుకాఎల్లమ్మకు బోనాల ఊరేగింపు, ఒడిబియ్యం సమర్పణ కార్యక్రమంతో పాటు పూజలు జరుగనున్నట్లు గౌడ సంఘం అధ్యక్షుడు మంగ రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆరెళ్ల విద్యాధర్‌గౌడ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, మాజీ కౌన్సిలర్లు గడ్డమీది యశోద, ఆరెళ్ల గాయత్రి, దొంతి లక్ష్మి, లక్ష్మీనారాయణగౌడ్ పాల్గొన్నారు.

ఐఎంఏ సంగారెడ్డి కార్యవర్గ ప్రమాణ స్వీకారం

- అధ్యక్షుడిగా డా.కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా డా.ఆనంద్



ప్రమాణ స్వీకారం చేసిన ఐఎంఏ సంగారెడ్డి నూతన కార్యవర్గం

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) సంగారెడ్డి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని సంగారెడ్డిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడిగా డా.కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా డా.ఎస్.ఆనంద్, కోశాధికారిగా డా.హరినాథ్, ఉపాధ్యక్షులుగా డా.చంద్రశేఖర్, డా.ఉషా, సంయుక్త కార్యదర్శులుగా డా.సురేశ్‌కుమార్, డా.జ్యోతి, డా.రాజుగౌడ్(తదుపరి అధ్యక్షులు) ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర ఐఎంఏ అధ్యక్షుడు డా.ద్వారకానాథ్‌రెడ్డి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ సంగారెడ్డి సీనియర్ వైద్యులు డా.శ్రీహరి, డా.విజయనిర్మల, డా.శ్రీధర్, డా.స్వామిదాస్, డా.రహీమ్, డా.కిషోర్, డా.చక్రపాణి, డా.కృష్ణమూర్తి, రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ ఆంథోనీస్‌లో కలాం సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్



ప్రశ్నాపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్ కరస్పాండెంట్ ఆంథోనీరెడ్డి

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి విద్యానగర్‌లోని సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌లో ఈ.అభ్యాస్ అకాడమీ ఆధ్వర్యంలో కలాం సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఆదివారం నిర్వహించారు. 22 పాఠశాలల నుంచి సుమారు 950 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఇ.ఆంథోనీరెడ్డి మాట్లాడుతూ మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయోలజీ, రీజనింగ్ సబ్జెక్టులపై 100 బిట్స్‌తో ఆబ్జెక్టివ్ పరీక్ష నిర్వహించామని తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఏప్రిల్ 12న హైదరాబాద్‌లో నిర్వహించే అవార్డుల ప్రదానోత్సవంలో మెమెంటోలు, నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రమీలారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



కరాటే పోటీల్లో బెల్టులు సాధించిన విద్యార్థులు

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి కరాటే పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆదివారం గుల్షన్ క్లబ్‌లో రెంజుకీ షోటోకాన్ కరాటే క్లబ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 100 మంది విద్యార్థులు హాజరయ్యారు. పోటీల్లో విద్యార్థులు ప్రతిభకనబరిచి వివిధ విభాగాల్లో బెల్టులు సాధించినట్లు కరాటే మాస్టర్ నగేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్లు దినాకర్, విద్యాసాగర్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

కదలదు.. వెలగదు..!

- 15 ఏళ్లుగా అలంకారప్రాయంగా పాలశీతలీకరణ కేంద్రం జనరేటర్



వృథాగా ఉన్న జనరేటర్

అల్లాదుర్గం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతుల సంక్షేమం కోసం అల్లాదుర్గంలో పాలశీతల కేంద్రం ఏర్పాటు చేయాలన్న సంకల్పంతో 15 ఏళ్ల క్రితం మంజూరుచేసిన జనరేటర్‌తో పాటు సామగ్రి వృథాగా పడి ఉన్నది. పట్టణంలోని మహిళా మండలి భవనంలో పాలశీతలీకరణ కేంద్రం ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. అయితే అధికారుల జాప్యంతో ఈ భవనంలో పంచాయతీరాజ్ డివిజన్ కార్యాలయం ఏర్పాటైంది. దీంతో ఈ భవనంలోని జనరేటర్‌తో పాటు సామగ్రి వృథాగా పడి ఉన్నది. లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసి, వృథాగా ఉన్న ఈ సామగ్రిని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.